విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, శనివారం 21, సెప్టెంబర్ 2024

సంక్షిప్త సమాచారం

26 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థలో 2024 విద్యా సంవత్సరానికి మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నాలుగో విడత వివిధ ట్రేడ్‌లలో ప్రవేశం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ నాగరాజు తెలిపారు. శుక్రవారం ఉరవకొండలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో ఈనెల 26 లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, అప్లై చేసిన విద్యార్థి 27న ప్రభుత్వ ఐటీఐ ఉరవకొండనందు సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. కౌన్సిలింగ్ షెడ్యూలు తేదీ 28న ప్రభుత్వ ఐటీఐ ఉరవకొండ, గాంధీ చౌక్ నందు గల భవనము లో అడ్మిషన్ కౌన్సిలింగ్ ప్రక్రియ ఉదయము 10 గంటల నుండి ప్రారంభమవుతుందని, వెరిఫికేషన్ పూర్తయిన విద్యార్థులు మాత్రమే ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో కౌన్సిలింగ్ కి హాజరు కావాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఉరవకొండ: విజయవాడ వరద బాధితుల కోసం నిస్వార్థ స్వచ్ఛంద సంస్థ సేకరించిన రూ. 82,486ల చెక్కును శుక్రవారం బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామసభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ కలెక్టర్‌కు చెక్కును అందజేసినట్లు నిస్వార్థ స్వచ్ఛం ద సంస్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట తెలిపారు. ఈ కార్య క్రమంలో జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ క్లబ్ రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-ఉరవకొండ: విజయవాడ వరద బాధితుల కోసం ఉరవకొండ ఎస్‌కేఆర్ క్లబ్ రూ.లక్ష విరాళాలను శుక్రవారం బెళుగుప్ప మండలం రామసాగరం గ్రామ సభలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు రాంపల్లి నాగరాజు, కార్యదర్శి మీసాల రామాంజనేయులు, సభ్యులు ఎర్రి స్వామి నాయుడు, శ్రీ రాములు, మారెన్న, చాబాల ఎర్రి స్వామి, టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎస్పీ గ్రీవెన్స్

విశాలాంధ్ర-అనంతపురం: జిల్లా ఎస్పీ పి.జగదీష్ జిల్లాలోని పోలీస్ సిబ్బంది సమస్యల పరిష్కారానికి శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహించారు. బదిలీలు, సస్పెన్షన్ రీటక్, ఇతర సమస్యలపై సిబ్బంది 8 పిటీషన్లు అందజేశారు. సర్వీస్ రూల్స్ ప్రకారం పరిష్కారం చూపాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీవీ రమణ మూర్తి, ఎస్పీ సీసీ ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే కర్తవ్యం

విశాలాంధ్ర-తాడిపత్రి: నూతన తహశీల్దార్‌గా రజాక్ వలి స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో కలెక్టరేట్లో పని చేశాడు. బదిలీల్లో భాగంగా మండల తహశీల్దార్‌గా పదవి బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ నిష్పక్షపాతంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ ప్రజలకు సేవ చేస్తానన్నారు.

ఆలయాన్ని తనిఖీ చేసిన అధికారులు

విశాలాంధ్ర-శింగనమల: మండల కేంద్రంలోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయాన్ని గురువారం రాత్రి దేవాదాయ శాఖ అధికారి శోభా రాణి తనిఖీ చేశారు. ఆలయంలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాన్ని తనిఖీ చేశామన్నారు. అర్చకుల జీతభత్యాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ నాయకులు బండమీద పల్లి కాయల రమణ యాదవ్, నారాయణస్వామి, ధన ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్న సీఐ

విశాలాంధ్ర-శింగనమల: జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణాపై గట్టి చర్యలు తీసుకుంటామని సీఐ కౌలుట్లయ్య తెలిపారు. అందులో భాగంగా తన సిబ్బందితో తనిఖీ నిర్వహిస్తుండగా మండల పరిధిలోని కల్లుమడి గ్రామ సమీపంలోని పెన్నా నదిలో నుండి అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక టాక్టర్లను శుక్రవారం పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. శింగనమల సర్కిల్ పరిధిలో ఇసుకాసురులు అధికంగా ఉన్నారని, అక్రమ ఇసుక రవాణా దారులను కట్టడి చేస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న సిబ్బందితో అక్రమాలకు తావు లేకుండా చూస్తానన్నారు.

విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షలు

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధి లోని పిన్నేపల్లి గ్రామం స్కూల్ లో శుక్రవారం తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధుసూదనరాజు జాతీయ అంధత్వనివారణ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా సివిల్ సర్జన్ డాక్టర్ సైదన్న ఆదేశాల మేరకు విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 44మంది విద్యార్థినీ విద్యార్థులలో ఏడుగురు విద్యార్థులకు కంటి అద్దాలు అవసరం ఉన్నట్లు గుర్తించారు. వారికి త్వరలో ఉచితంగా కంటి అద్దాలు అంద చేస్తామన్నారు. ప్రధానోపాధ్యాయులు జి.వేంకట నారాయణ ఎస్.గోవిందమ్మ పాల్గొన్నారు.

స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

విశాలాంధ్ర-గోరంట్ల: మండలంలోని పాలసముద్రం గ్రామంలో 16న దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి మరణిస్తే దారిలేక నీటి గుంటలోనే శవాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్ళారు. దీంతో స్పందించిన గోరంట్ల మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ బోయ శేఖర్, ఇన్చార్జి తహశీల్దార్ రెడ్డి శేఖర్‌లు స్మశాన వాటికకు తక్షణమే దారి చూపాలని నిర్ణయించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేకర్ రెడ్డి, సర్వేయర్ తాతయ్య, నరేంద్ర, వీఆర్ఓ రమేష్, కానిస్టేబుళ్లు వెంకటేశ్, లోకేశ్వరలు పరిశీలించారు. టీడీపీ నాయకులు అయిన బెల్లల చెరువు చంద్ర, మనోహర్, జయచంద్ర రెడ్డి, రెవెన్యూ అధికారులు దళితులకు కొత్తగా స్మశాన వాటికకు స్థలం చూపించాలని కోరారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్: కూటమి ప్రభుత్వం నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసే దిశగా ప్రణాళిక రూపొందిస్తున్నారని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ పిలుపు మేరకు సీబావి, ఒంటిమిది, వడ్డే కాలనీ తదితర గ్రామాలు మున్సిపాలిటీ పరిధిలోని వార్డు మంచి ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, మున్సిపల్ కమిషనర్ వంశీకృష్ణ భార్గవ, స్పెషల్ ఆఫీసర్లు, టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి మల్లికార్జున, కరణం రామ్మోహన్ చౌదరి, మాజీ మున్సిపల్ చైర్మన్ వైపీ రమేష్, గోళ్ళ సర్పంచ్ కవితా బొజ్జన్న, తిమ్మారెడ్డి, వెంకటేశులు, తలారి సత్తి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఓపెన్ స్కూల్స్ పోస్టర్లు ఆవిష్కరణ

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: ఓపెన్ స్కూల్స్ అడ్మిషన్లకు సంబంధించిన పోస్టర్లను అసిస్టెంట్ కమిషనర్ గోవింద నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం డ్వామా ఇన్ ఛార్జ్ పీడీ పి.విజయలక్ష్మి, ఫైనాన్స్ మేనేజర్ వెంకట్ నాయుడు, జిల్లా విజిలెన్స్ ఆఫీసర్ రమణా రెడ్డి, పర్యవేక్షకులు శైలజ, ఉద్యోగులు కలిసి పోస్టర్లను ఆవిష్కరించారు. డ్వామాలో పని చేస్తున్న ఉద్యోగులలో ఎవరైనా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదువు కోలేనివారు ఉంటే అలాంటి వారిని ఏపీ ఓపెన్ స్కూల్స్‌లో జాయిన్ చేయించాలని ఏసీ గోవింద నాయక్ కోరారు. ఇంచార్జి పీడీ, ఇతర అధికారులు సానుకూలంగా స్పందించి ఈ విషయాన్ని తమ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల అందరి దృష్టికి తీసుకెళ్తామని అన్నారు.

సీతారాం ఏచూరి వ్యక్తి కాదు, వ్యవస్థ : సీపీఐ జిల్లా కార్యదర్శి

విశాలాంధ్ర - అనంతపురం: లౌకికతత్వం, ప్రజాస్వామ్యం, ఫెడరల్ విధానం, సామాజిక న్యాయం అనే రాజ్యాంగ హక్కులను కాపాడేందుకు చివరి శ్వాస వరకు కృషి చేసిన సీతారాం ఏచూరి జీవితం అందరికి ఆదర్శమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక లలిత కళ పరిషత్తులో శుక్రవారం సీతారాం ఏచూరి సంస్మరణ సభకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వి.రాం భూపాల్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథుల్లో ఒకరైన సీపీఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్ మాట్లాడుతూ ఏచూరి వ్యక్తి కాదు, వ్యవస్థ అని, ఆయన మృతికి ప్రపంచ దేశాల కమ్యూనిస్టు నేతలు నివాళులర్పించడం జరిగిందన్నారు. దేశంలో రాజకీయ పార్టీలకతీతంగా సీతారాం ఏచూరిని కొనియాడుతున్నారని వెల్లడించారు. ఏచూరి 12 ఏళ్లుగా రాజ్యసభలో అద్భుతమైన ప్రసంగాలలో బలమైన విమర్శలు చేశారన్నారు. 2009లో ఇండియా గేట్ వద్ద పుస్తకావిష్కరణ కార్యక్రమములో విభిన్న సిద్ధాంతాలకు సంబంధించిన వారు హాజరు కావడం జరిగిందని, కాంగ్రెస్ పార్టీ కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి జైపాల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు వెంకయ్య నాయుడు, పోలిట్ బ్యూరో సభ్యులుగా సీతారాం ఏచూరి హాజరైనారన్నారు. విభిన్న సిద్ధాంతాలకు సంబంధించిన వారు ఒక వేదిక పైన హాజరు కావడం అరుదైన ఘటన అన్నారు. టీడీపీ ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు, వైసీపీ మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వైవీ శ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మాజీ మంత్రి డాక్టర్ శైలజనాథ్, మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, మేయర్ వసీం, సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు ఓబులు, ఇంతియాజ్ పాల్గొన్నారు.

మండలంలో రెచ్చిపోతున్న ఇసుక మాఫియా

విశాలాంధ్ర-శింగనమల: మండల పరిధిలోని పి.జాలా లాపురం గ్రామంలో రాత్రి వేళల్లో అక్రమంగా ఇసుకను ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఉల్లికళ్ళు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడి జేసీబీని గ్రామ రైతులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ప్రతి రోజు రాత్రి 10 గంటల నుండి తెల్లవారుజామున వరకు టిప్పర్లు ట్రాక్టర్ల ద్వారా అక్రమ ఇసుకను తరలించి, గ్రామంలో నిద్ర లేకుండా ఇసుకా సురులు అలజడిసృష్టిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. పోలీసులు ఎంత కట్టడి చేసినా షరామామూలుగానే అక్రమ ఇసుకను తరలిస్తున్నారని, ఇసుకాసరులు సొమ్ము చేసుకొని జేబులు నింపుకుంటున్నారని, పోలీసులకు పట్టిస్తే ఫైన్ కడతామని, అంతకంటే మించి మమ్మల్ని ఎవరేమి చేయలేరని, ఇసుకాసురులు రెచ్చిపోతున్నారన్నారని మండిపడుతున్నారు. అక్రమ ఇసుకను తరలిస్తే తమ బోర్లలో నీరు అడుగంటి పోతుందని, పంట పొలాలు ఇప్పటికే ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక అక్రమ రవాణా మాఫియాను అరికట్టాలని వి.జలాలపురం రైతులు కోరుతున్నారు.

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎంపిక

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన ఎన్నికలు కళ్యాణ్ దుర్గం పట్టణంలో నిర్వహించగా అనంతపురం జిల్లా నూతన అధ్యక్షులుగా హనుమంతు రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కుల్లాయి స్వామిలను ఎన్నుకున్నారు. జిల్లా ఆఫీస్ బేరర్స్ గానరసింహాయాదవ్, సాయిస్వరూప, రాధా జ్యోతి, వెంకటనాయక్, ఆంజనేయులు, వంశీ మంజునాథ్ చందు వీరితోపాటు 21 మంది కార్య వర్గం 45 మంది కౌన్సిల్‌తో ఏఐఎస్ఎఫ్ నూతన జిల్లా కౌన్సిల్నును ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జాన్సన్ బాబు శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నారాయణస్వామి అభినం దించారు. అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వ వసతి గృహాల్లో, గురుకుల, కస్తూరిబాయ్ పాఠశాలలో విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పెద్ద ఎత్తున పోరాటాలు శ్రీకారం చేపడతామన్నారు.

జిల్లా సహాయ కార్యదర్శిగా తగ్గుపర్తి చందు

విశాలాంధ్ర-ఉరవకొండ: ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు కళ్యాణ్ దుర్గం పట్టణంలో ఘనంగా జరిగాయి. ఏఐఎస్ఎఫ్ జిల్లా నూతన కమిటీలో భాగంగా ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా పని చేస్తున్న తగ్గుపర్తి చందును జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఏఐ ఎస్ ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శిగా తన ఎన్నికలకు సహకరించిన జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర సమితికి కృతజ్ఞతలు తెలిపారు.

ఆదర్శ గురువు ప్రొఫెసర్ శేషయ్య

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: సమాజ క్రాంతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుందుర్పి మండలం తూముకుంట విలువలబడిలో ఆదర్శ గురువు, గొప్ప మానవతావాది, అమరజీవి ప్రొఫెసర్ శేషయ్య జయంతిని శుక్రవారం నిర్వహించారు. ప్రొఫెసర్ శేషయ్య అత్యంత సామాన్య కుటుంబంలో జన్మించి, చదువు ద్వారా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం న్యాయ శాస్త్ర విభాగం అధిపతిగా ఎదిగి వేలాది మంది న్యాయకోవిదులను తయారు చేయడమే కాక తన జీవితాంతం రాజ్యాంగ హక్కుల పరిరక్షకుడిగా, పేద ప్రజలకు అండగా అలుపెరుగని పోరాటాలు చేశారని, దేశంలో అట్టడుగు వర్గాలు, పేద ప్రజల అభ్యున్నతికి నిరంతరం కృషి చేశారని జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు క్రియేటర్ కృష్ణ, ఆదర్శ ప్రభుత్వ ఉపాధ్యాయులు రాజశేఖర్ రెడ్డి, కల్పన, సిద్ధగిరి శ్రీనివాసులు,త ూముకుంట గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మటం తిప్పేస్వామి కొనియాడారు. చదువు ఒక మనిషిని ఎంత స్థాయికి తీసుకెళుతుందో గొప్ప స్థాయికి వెళ్లిన తర్వాత సమాజానికి ఆ వ్యక్తి ఎంత ఉపయోగపడగలడో ప్రత్యక్ష ఉదాహరణ ప్రొఫెసర్ శేషయ్య గారన్నారు. ఈ కార్యక్రమంలో విలువల బడుల కోఆర్డినేటర్లు లక్ష్మణమూర్తి, రఘువీరా, బొమ్మలింగ, శ్రీకాంత్, విలువలబడి ఉపాధ్యాయుడు బాబు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొని శేషయ్య గారికి నివాళులర్పించారు.

స్మశాన వాటిక మరమ్మతులను చేపట్టాలి

విశాలాంధ్ర-గుత్తి / గుంతకల్: పట్టణ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో సత్యనారాయణ పేట స్మశాన వాటిక బర్నింగ్ శాల, మురికి నీరు శుద్ధి రిజర్వాయర్ ఏర్పాటు చేయాలని గుంతకల్ నియోజకవర్గం ఇంచార్జ్ బద్రి స్వామి కోరారు. ఈ కార్యక్రమానికి సీపీఐ పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షతన ముఖ్య అతిథులుగా పార్టీ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి పాల్గొని మాట్లాడారు. ఈ స్మశాన వాటిక దాదాపుగా 70 ఏళ్ల నుండి వాడుకలో ఉందన్నారు. విస్తీర్ణ ఏడెకరాల మూడు సెంట్లు, ప్రస్తుత 15 వార్డులు సంబంధించిన ప్రజలు మరణిస్తే వారిని తీసుకుని వచ్చి పూడ్చడం జరుగుతుందన్నారు. స్మశాన వాటికలో రోటరీ క్లబ్ వారికి రెండు ఎకరాల భూమిని కేటాయించడంతో పూర్తిగా తగ్గిపోయిందన్నారు వర్షపు నీరు వస్తే ప్రక్కనే ఉన్న సాయి రత్న ఎస్టేట్, వాల్మీకి నగర్ కాలనీలకు సంబంధించిన మురికి నీరు, వర్షపు నీరు స్మశాన వాటికలో చేరి పెద్ద చెరువు మాదిరిగా మారిపోతుందన్నారు. ఈ నీరు బయటకు పోవడానికి మార్గం లేదని, శవాలను పూడ్చడానికి ఒక అడుగు గుంత తీస్తే నీరు వస్తుందన్నారు. మూడు కాలువలు ఏర్పాటు చేసి ట్రాక్ పక్కకు పంపి, రోడ్డుపై కల్వర్టులు నిర్మించాలని డిమాండ్ చేశారు. బర్నింగ్ శాల 2022లో నిర్మాణం చేశారని, నేటికి ఉపయోగకరంగా లేదన్నారు. బర్నింగ్ శాల నిర్మాణం పూర్తి చేయాలని సీపీఐ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య, సీపీఐ నాయకులు మల్లయ్య, ప్రసాద్, నూర్ బాష, ప్రజానాట్యమండలి పట్టణ పుల్లయ్య, ఏఐవైఎఫ్ నాయకులు అఖిల్, రోహిత్, మనీ, భేటీ పకీరప్ప, కాలనీ సీనియర్ నాయకులు గడ్డ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పైప్ లైన్ పనులను పరిశీలన

విశాలాంధ్ర-యాడికి: మండల కేంద్రంలోని చందన రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో వాటర్ ట్యాంక్ నుండి జగనన్న కాలనీ, హాస్పిటల్ కాలనీ వాసులకు, చందన రోడ్డులోని ప్రజలకు నీటి సౌకర్యం కొరకు పైప్ లైన్ మరమ్మతు పనులను మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్ శుక్రవారం పరిశీలించారు. కాలనీలలో సమస్యలు ఏమైనా ఉంటే పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్ వార్డ్ సభ్యులు గజ్జి బాలపెద్దయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ పందు శ్రీరాములు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-అనంతపురం: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలపై జిల్లాలోని పాఠశాల, కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, యూనివర్సిటీలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఎన్‌కార్డ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని జిల్లా ఎస్పీ జగదీష్‌తో కలిసి జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు ఉపయోగించకుండా గట్టి నిఘా చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడడం వల్ల కలిగే వ్యతిరేక ప్రయోజనాలు ఏంటి అనే దానిపై తెలియజేయాలన్నారు. ఆర్డీవోలు వసంత బాబు, డీటీసీ వీర్రాజు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడీ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

21న జీ తెలుగులో మెగా ఈవెంట్

విశాలాంధ్ర-అనంతపురం: నిరంతరం వినోద కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరిస్తున్న జీ తెలుగు బుల్లితెర అభిమానులకు తమకు ఇష్టమైన నటీనటులను నేరుగా కలిసే అవకాశం కల్పిస్తోందనీ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. జీ తెలుగు సీరియల్స్ ముక్కుపుడక, జగద్ధాత్రి, సూర్యకాంతం నటీనటులతోపాటు ఇతర నటీనటులు ఈ నెల 21న మన గుంతకల్లో నిర్వహించనున్న మెగా ఈవెంట్ ముక్కుపుడక మహారాణి వర్సెస్ మెగా జగద్ధాత్రి.. కార్యక్రమంలో పాల్గొనేందుకు రాబోతున్నారన్నారు. ఇక ఈ కార్యక్రమానికి ఎనర్జిటిక్ యాంకర్ లాస్య వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా, పలువురు జీ తెలుగు నటీనటులు సందడి చేయనున్నారనీ తెలిపారు. గుంతకల్ రైల్వే గ్రౌండ్ వేదికగా ఈ నెల 21 వతేది సాయంత్రం 5 గంటల 30 నిమిషాల నుంచి ముక్కుపుడక మహారాణి వర్సెస్ మెగా జగద్ధాత్రి మెగా ఈవెంట్ పేరున ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరగనుందన్నారు. ఇందులో భాగంగా మీ టీవీలో 'జీ తెలుగు' ఛానల్ చూస్తూ సెల్ఫీతీసి 7032904615 నెం.కి వాట్సాప్ చేస్తే మీ అభిమాన తారలు నేరుగా మీ ఇంటికి వచ్చి ఆతిథ్యం స్వీకరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ముక్కుపుడక, జగద్ధాత్రి, సూర్యకాంతం సీరియల్స్ నటీనటులు పాల్గొని సందడి చేయనున్నారన్నారు.

ప్రజల సహకారంతోనే క్లీన్ అండ్ గ్రీన్ సాధ్యం

విశాలాంధ్ర బ్యూరో-అనంత పురం: ప్రజల భాగస్వామ్యం ఉంటేనే ఊరు బాగుంటుందని, అప్పుడు రాష్ట్రం, దేశం స్వచ్ఛతగా ఉంటుందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం లో భాగంగా హౌసింగ్ బోర్డులోని చిల్డ్రన్స్ పార్క్‌లో ఆయన మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయ భాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్యం, టీడీపీ నాయకులు, వైసీపీకి చెందిన కార్పొరేటర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే దగ్గుపాటి మొక్కలు నాటి, నీరు పోశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మన రాష్ట్రం, దేశం బాగుండాలన్న ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, మాజీ కార్పొరేటర్, జిల్లా ఉపాధ్యక్షుడు సరిపూటి రమణ, మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవి, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ యాదవ్, టీడీపీ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, నారాయణస్వామి యాదవ్, రాయలసీమ బలిజ సంఘ యువజన అధ్యక్షుడు తొండనపాటి రమేష్, జనసేన నగర ప్రధాన కార్యదర్శి ఇమామ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిగ్రస్తులకు కిట్ల పంపిణీ

విశాలాంధ్ర-గుత్తి: పట్టణం ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప, డిప్యూటీ పేరామెడికల్ అధికారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కుష్ఠు వ్యాధి రోగులకు కిట్ల పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కుష్టు వ్యాధి బారినపడి మందులు వాడుతున్న వారికి, అంగవైకల్యం వారికి శాస్త్ర చికిత్సల కొరకు స్క్రీనింగ్ నిర్వహించారు. చర్మంపై మామూలు రంగు కాకుండా ఏ విధమైన వేరే రంగుతో తెల్లగా స్పర్శలేని మచ్చలు ఉంటే వెంటనే సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోపిటి జాన్ పీటర్, డీపీఎంవో రామచంద్ర, డిప్యూటీ పారామెడికల్ అధికారి వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వర్ణకారుల సమస్యలను పరిష్కరిస్తాం

విశాలాంధ్ర-తాడిపత్రి: స్వర్ణకారుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తారని తహశీల్దార్ రజాక్ వలి తెలిపారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్వర్ణకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్ రజాక్ వలికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వర్ణకార సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి హయంలో స్వర్ణకార కార్మికులకు ఆటోనగర్ సమీపంలో ఇంటి స్థలాలు ప్రభుత్వం పంపిణీ చేసిందన్నారు. పంచాయతీ అధికారులు ఇంటి పన్ను వేయాలంటే ఇంటి స్థలాలకు సంబంధించిన పొజిషన్ సర్టిఫికెట్ కావాలని చెబుతున్నారని, దీంతో తాము విద్యుత్ లేక రాత్రి సమయాలలో భయం భయంతో జీవనం గడుపుతున్నామన్నారు. తమ కాలనీలో రోడ్లు, నీటి సౌకర్యం లేదని, స్వర్ణకార కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వేడుకుంటున్నా మన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ స్వర్ణకార కార్మికుల సమస్యలను త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్వర్ణకారుల సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు బషీర్ బాష సెక్రటరీ సలీం బాష, షబ్బీర్, నజీర్, హుస్సేన్ పీరా, ఇలాఖత్, షబ్బీర్, బషీరు, దాదావలి, షఫీ, షామీర్, అమీరు, దాదావలి, జహంగీర్ బాష తదితరులు పాల్గొన్నారు.

మంచి చేయడమే ప్రభుత్వ ఉద్దేశం

విశాలాంధ్ర-బెళుగుప్ప: రాష్ట్ర ప్రజలకు మంచి చేయడమే కూటమి ప్రభుత్వ ఉద్దేశ్యమని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. శుక్రవారం బెళుగుప్ప మండలం రామసాగరం పంచాయతీ కేంద్రంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమములో ముఖ్యఅతిథిగా మంత్రి కేశవ్ పాల్గొని మాట్లాడారు. కలెక్టర్ వినోద్ కుమార్, గ్రామ సర్పంచి రామకృష్ణమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ప్రసంగించారు. క్రొత్త ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకొన్నందున ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో ప్రభుత్వం పనితీరు సంక్షేమ కార్యక్రమాలు గురించి ప్రజలకు క్షుణ్ణంగా వివరించారు. నియోజకవర్గం ప్రత్యేక అధికారి శ్రీనివాసులరెడ్డి, శంకర్, తహశీల్దార్ షర్మిల, ఎంఈఓ మల్లారెడ్డి, అగ్రికల్చర్ పృథ్వి, హార్టికల్చర్ కృష్ణతేజ, ఏపీఎం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలి

విశాలాంధ్ర-రాప్తాడు: విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సర్పంచ్ సాకే తిరుపాలు, టీడీపీ కన్వీనర్ పంపు కొండప్ప సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథులుగా రాప్తాడు సర్పంచ్ సాకే తిరుపాలు, మండల కన్వీనర్ పంపు కొండప్ప హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తోందని, భవిష్యత్తులో ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ గంజి లక్ష్మీదేవి, హెచ్‌ఎం సాంబశివ, వాలీబాల్ క్రీడ సెలక్షన్ కమిటీలో పీడీలు సీరాజ్ ముస్తఫా, కబడ్డీలో నారాయణరెడ్డి, నరసింహ, ఖోఖోలో రాప్తాడు చిట్రా ఆది, నాగరత్న, షటిల్ బ్యాడ్మింటన్ ఎంపికలో ఆదినారాయణ, రవి పాల్గొన్నారు.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్కాలర్షిప్‌కు ఎంపిక

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: మదనపల్లి ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్ కళాశాల ఎంసీఏ మొదటి సంవత్సరము చదువుతున్న 5 మంది విద్యార్థిలకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ పరివర్తన్ ఈసీఎస్ఎస్ ప్రోగ్రామ్ స్కాలర్షిప్‌లు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థుల ప్రగతి హెచ్‌డీఎఫ్‌సీ మెరిట్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ స్కాలర్షిప్‌లు అందజేసినట్లు ఆయన అన్నారు. దొడ్ల దీప్తి, నాదెండ్ల గిరి, ఏర్వ వెంకట తరుణ్, బి.సహిత, కంసల సంధ్యా రాణిలు స్కాలర్షిప్‌లు పొందిన విద్యార్థులలో ఉన్నారని, వీరికి ఒక్కొక్కరికి రూ.35 వేల చొప్పున స్కాలర్షిప్‌ను అందజేసినట్లు తెలిపారు. కళాశాల కరెస్పాండంట్ డాక్టర్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, యు.ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కమల్ బాష, స్టూడెంట్ వెల్ఫేర్ ఆఫీసర్ డాక్టర్ సమీనా, మౌలాలి అభినందనలు తెలిపారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష చెక్కు అందజేత

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: విజయవాడ ముంపు ప్రాంతాల వరద బాధితుల సహాయార్థం కళ్యాణదుర్గంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ సమన్వయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లక్ష రూపాయల ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో సీఎం రిలీఫ్ అందించారు. శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు శ్రీధర్, తిప్పేస్వామి, ఓబుళపతి ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు రాయల్ వెంకటేష్, వినియోగదారుల సంఘం అధ్యక్షులు చల్లా కిషోర్, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.ఈశ్వరయ్య, తెలుగు నాడు ఉపాధ్యాయ సంఘం నాయకులు కె.నరసింహులు, హాస్టల్ వార్డెన్ నాగరాజు, సమన్వయకర్త జి.అశోక్ కుమార్, సహాయకులు ఆది ఆంధ్ర తిప్పేస్వామి, వైద్య సిబ్బంది సోమశేఖర్ తదితరులు ఎమ్మెల్యే సురేంద్రబాబుకు చెక్కు అందించిన వారిలో ఉన్నారు. విజయవాడ ముంపు ప్రాంతాల వరద బాధితులకు స్పందించు - సాయమందించు అనే స్ఫూర్తితో విరాళాలు సేకరించి లక్ష రూపాయల చెక్కును అందించారు.

దీర్ఘకాలిక బకాయిలు చెల్లించండి : ఎస్టీయూ

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, రామాంజనేయులు డిమాండ్ చేశారు. శుక్రవారం నార్పల మండలంలోని వివిధ పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత నమోదు కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ. దాచుకున్న డబ్బు నుంచి పీఎఫ్ లోన్లు, ఏపీజీఎల్ఐ లోన్లు, ఫైనల్ పేమెంట్స్, ఆర్జిత సెలవుల నగదు చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తుందని విమర్శించారు. పిల్లల చదువులకు, ఇంటి నిర్మాణానికి, పిల్లల పెళ్లిళ్లకు దాచుకున్న డబ్బు ఉపయోగపడుతుందని ఆశించిన ఉద్యోగులకు నిరాశ మిగిలిందన్నారు. వెంటనే దీర్ఘకాలిక బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, మండల నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

మరిన్ని వార్తలు E-PAPERలో

కనపడని స్వచ్ఛ భారత్

పత్రికలు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - అగళి: మడకశిర నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజుని ఒక పత్రిక ఉద్దేశ్య పూర్వకంగా తప్పుడు రాతలు రాసి బురద జల్లుతున్నారని బీజేపీ కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ వెల్లడించారు. పత్రికలు నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు. మడకశిర సుకన్య ఆసుపత్రిలో జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అప్పులలో కూరుకు పోయిన రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అన్ని విధాల సహకరించి, అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ రాష్ట్రానికి ఉదారంగా నిధులు ఇస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వంద రోజుల్లో మడకశిర నియోజకవర్గం అభివృద్ధి బాటలో ముందుకెళ్తోందన్నారు. మడకశిరలో జరుగుతున్న అభివృద్ధి ని చూసి ఓర్వలేక ఒక పత్రిక తప్పుడు రాతలు రాస్తుందని తెలిపారు. అబద్దలు, అసత్యాలు రాయడం పత్రికకు పుట్టుక తో వచ్చిన వ్యాధి అన్నారు. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల మడకశిర 20 ఏళ్లు వెనుకకు వెళ్లిందన్నారు. కూటమి ముఖ్యమంత్రిగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి మడకశిరకు వచ్చినప్పుడు నియోజకవర్గంలోని శాశ్వత తాగు, సాగు నీటి పరిష్కారం కోసం రాళ్లపల్లి, రత్నగిరి రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీచర్ సెల్ కన్వీనర్ లక్ష్మీనారాయణ, కిసాన్ మోర్చా అసెంబ్లీ ఇన్చార్జ్ డాక్టర్ కేఆర్‌వీ గుప్తా, జిల్లా కార్యవర్గ సభ్యులు సిఎల్ లేంకప్ప, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు మతం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: మండల కేంద్రంలో అపరిశుభ్రత ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందముగా స్వచ్ఛతాహీ సేవా కనపడడం లేదంటూ స్థానిక పుర ప్రజలు చర్చించుకుంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛతాహీ సేవా అనే కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యముగా ఉండాలనే ఉద్దేశంతో విద్యార్థులు, ర్యాలీలు, మానవహారాలు, అవగాహన సదస్సులు, సమావేశాలు ఇలా ఎన్నో ఆర్భాటాలు చేసిన, స్వచ్ఛభారత్ కనబడకుండా మురుగు నీరు ఎక్కడపడితే అక్కడ డ్రైనేజీలలో వ్యర్థ పదార్థాలతో నిండిపోయి, మురుగు రహదారులపై ప్రవహిస్తూ ఉంది. ఇదే అదునుగా పందులు స్వైర విహారం చేస్తూ ఆ మురుగులో దొర్లుతూ ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తున్నాయి. దీంతో ఆ డ్రైనేజీ మురుగునీరు దుర్వాసన వెదజల్లుతూ, క్రిమి కీటకాలకు అవాస స్థలాలుగా ఏర్పరచుకునేందుకు తయారైనట్లున్నాయి. మండల కేంద్రంలోనే ఈ దుస్థితి ఏర్పడితే, మరి క్షేత్ర స్థాయిలో డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉంటుందో చెప్పకనే చెప్పవచ్చు. తూతూ మంత్రముగా ప్రధాన రహదారులలో, కార్యాలయాలు చుట్టూ పరిశుభ్రత చేపట్టి మమ అనిపిస్తున్నారని ప్రజలు చర్చించుకొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ట్యాంకులు శుభ్రం చేయాలని డీపీవో ఇటీవల తెలపగా మండల కేంద్రంలో మాత్రమే అక్కడక్కడ చేసినట్లు సమాచారం. నీటి ట్యాంకుల్లో దుర్వాసన వస్తుందనిని క్లోరినేషన్ చేపట్టి తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన అవసరం ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి క్షేత్ర స్థాయిలో పరిశుభ్రతపై అవగాహన కల్పించి ప్రజలను రోగాల బారిన పడకుండా, పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రజలు, మేధావులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రాష్ట్ర స్థాయికి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

విశాలాంధ్ర-ధర్మవరం: అండర్-19 విభాగం బాలుర ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో జరిగే టేబుల్ టెన్నిస్, అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన షూటింగ్ బాల్ విభాగములు ఉమ్మడి జిల్లా స్థాయిలో జరిగిన ఎంపికలో టేబుల్ టెన్నిస్ విభాగంలో పవన్ కుమార్ షూటింగ్ బాల్ విభాగంలో చరణ్ కుమార్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్ శైలజా తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు కర్నూలునందు జరిగే పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో నైపుణ్యాన్ని కదపరిచి అర్హత సాధించాలని వారు తెలిపారు. అనంతరం హెడ్మాస్టర్ శైలజాతో పాటు హిందీ పండిట్ వేణుగోపాల్, వ్యాయామ ఉపాధ్యాయుడు నాగేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు శుభాకాంక్షలు తెలిపారు.

రోగులకు సేవ చేయుట దైవ సేవతో సమానం

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు సేవ చేయుట దైవ సేవతో సమానమని శ్రీ సత్య సాయి సేవాసమితి నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని 360 మంది రోగులకు సహాయకులకు భోజనపు ప్యాకెట్లను, వాటర్ ప్యాకెట్లు ఆసుపత్రి వైద్యులుపంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ నాటి ఈ సేవా కార్యక్రమం శ్రీ సత్య సాయి సేవా సమితి వారు దాతగా నిర్వహించడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. దాతల సహాయ సహకారాలు లేనిదే ఏ కార్యక్రమం విజయవంతం కాదని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మాధవి మాట్లాడుతూ సేవా సమితి వారు చేస్తున్న సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

సంక్షోభంలోనూ సంక్షేమం చంద్రబాబుకే సాధ్యం

విశాలాంధ్ర -రొద్దం: సంక్షోభంలోనూ సంక్షేమం అందించడం చంద్రబాబు నాయుడుకే సాధ్యమని మంత్రి సవిత అన్నారు. పెనుకొండ నియోజకవర్గం రొద్దం మండలం కొగిర గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి వంద రోజుల్లో ఎన్డీఏ ప్రభుత్వం చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుపై వెలుగు సంతకం మెగా డీఎస్సీ ఉచిత ఇసుక విధానం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా కల్పించారని మంత్రి సవిత తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధికారులు, స్థానికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-ముదిగుబ్బ: మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ పాఠశాలలో ఆర్యవైశ్య మహాసభ యువజన సంఘం డైరెక్టర్ నామ వినయ్ కుమార్, ఈ నెల 22వ తారీఖున ధర్మవరం నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ జన్మదిన సందర్భంగా విద్యార్థులకు ఎగ్జామ్స్ ప్యాడ్స్, జామెంట్రీ బాక్సులు పంపిణీ చేశారు.

ఆర్మీ మాజీ ఉద్యోగ మృతికి పలువురు సంతాపం

విశాలాంధ్ర- పెనుకొండ: పట్టణం లోని ఆల్విన్ కాలనీ నివాసముండే చిన్న కుల్లాయ స్వామి (78) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయనకు భార్య పార్వతమ్మ, కుమారుడు భాను ప్రకాష్ ఉన్నారు. ఇతను ఆర్మీలో దేశ సేవ చేశారు. చిన్న కుల్లాయ స్వామి మృతి తెలుసుకొని మాజీ ఆర్మీ ఉద్యోగులు, టీడీపీ నాయకులు, ఆత్మీయ బంధువులు వచ్చి ఆయన మృతదేహానికి నివాళులర్పించి, ఆయన సేవలను కొనియాడారు.

తల్లిదండ్రులతో ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల ఆత్మీయ సమ్మేళనాన్ని శుక్రవారం ప్రిన్సిపాల్ సుదర్శన్ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల నడవడిక, చదువు, సంస్కారం మానవతా విలువల గురించి విద్యతోపాటు మానవతా విలువలు పెంచాలన్నారు. ప్రవర్తనపై ప్రత్యేక దృష్టి ఉంచి ఎప్పటికప్పుడు గమనిస్తుంటే వాళ్ళు తప్పక ప్రయోజకులు అవుతారని తల్లిదండ్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు బషీర్ అహ్మద్, రామచంద్రయ్య, విజయలక్ష్మి, శంకరప్ప, కేశవరెడ్డి, శివన్న, ఉమాశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తాం

విశాలాంధ్ర-కనగానపల్లి: గత టీడీపీ ప్రభుత్వం హయాంలో రూ.5 కోట్ల ఈఏపీ నిధులతో మంజూరైన రంగంపేట, సీఎస్ కోట, తూముచర్ల, తగరకుంట రోడ్డు నిర్మాణం పనులను పూర్తి చేస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. ఆయా గ్రామాల ప్రజల విన్నపం మేరకు వెల్లడించారు. ప్రస్తుతం రూ.20లక్షలతో కల్వర్ట్ నిర్మాణానికి కలెక్టర్ నిధులు మంజూరు చేశారని, రైతులు వ్యవసాయపొలాలకు వెళ్ళడానికి హంద్రీ నీవా కాలువపై రహదారి సౌకర్యం కల్పిస్తామని ఈ సందర్భంగా తూముచర్ల గ్రామస్థులకు హామీ ఇచ్చారు.

వరుణ దేవుడి కోసం రైతులు నిరీక్షణ

విశాలాంధ్ర-గుడిబండ: మండల వ్యాప్తంగా ఎంతో ఆశతో సాగు చేసిన వేరుశనగ పంట గత కొన్ని రోజులుగా వరుణుడు ముఖం చాటే యడంతో వేరుశనగ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చేతికందుతున్న పంటను కాపాడుకోలేక రైతులు ఆరాటపడుతున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వం హయాంలో ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచితంగా పైపులు, రెయిన్‌గన్లు సరఫరా చేసి ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు ప్రోత్సాహం అందించి రైతులకు అండగా నిలిచారు. మళ్ళీ ఏడాది సైతం అలాంటి పరిస్థితులే ఎదురవడంతో రైతులు ప్రభుత్వం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో స్పందించి ఎండుతున్న పంటలను కాపాడుకోవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఏ మేరకు స్పందిస్తుందో వేచి చూడాలి.

డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్స్‌ను పరిశీలన

విశాలాంధ్ర-చిలమత్తూరు రూరల్: చిలమత్తూరు మండలం కోడూరు గ్రామమునందు శుక్రవారం రైతు ప్రభాకర్ పదేకరాల్లో సాగుచేసిన దానిమ్మ పంటను జిల్లా పుట్టపర్తి కలెక్టర్ టీఎస్ చేతన్ పరిశీలించారు. ఏపీఎంఐపీ ద్వారా 90 శాతం సబ్సిడీతో ప్రీమియర్ కంపెనీ ద్వారా పొందిన డ్రిప్పు యూనిట్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. రైతును జిల్లా కలెక్టర్ దానిమ్మ పంట గురించి డ్రిప్పు ఇరిగేషన్ గురించి వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. దానిమ్మ సాగు చేసి 18 నెలలు అయిందనీ, క్రాప్ కటింగ్ మరి కొద్ది రోజుల్లోనే జరుగుతుందన్నారు. హార్టికల్చర్ పంటలు పైపు మొగ్గు చూపి డ్రిప్ ఇరిగేషన్ వినియోగించుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని రైతులను కోరారు.

మరిన్ని వార్తలు E-PAPERలో..

సంక్షిప్త సమాచారం

ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈ నెల 22న ఆదివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి చికిత్స శిబిరమును నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు వేణుగోపాలచార్యులు, కార్యదర్శి రమేష్ బాబు, కోశాధికారి నాగేంద్ర తెలిపారు. క్యాంపు దాతగా లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు గూడూరు నాగయ్య జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఉచిత వైద్య చికిత్సలతో పాటు ఉచితంగా కంటి ఆపరేషన్ కంటి అద్దాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆధార్ కార్డు సేవలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-గుడిబండ: మండల పోస్ట్ ఆఫీస్ నందు ఆధార్ కార్డ్‌కు సంబందించిన అన్నీ సేవలను అందించడం జరుగుతుందని, ఈ సేవలను పోస్ట్ ఆఫీస్ పరిధిలో ఉన్న వినియోగదారులే గాక ఇతరులు సద్వినియోగం చేసుకోవచ్చని గుడిబండ తపాలా సబ్ పోస్ట్ మాస్టర్ సుదర్శన్, ఎక్సుక్యూటివ్ అధికారి సి.నింగేశ్వర్ తెలిపారు. ఆధార్ కార్డులో పేర్లు, పుట్టిన తేదీలు మార్చుకోవాలనే వారు, కొత్తగా పిల్లలకు ఆధార్ నమోదు చేసేవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు కావలసినవారు గుడిబండ సబ్ పోస్ట్ ఆఫీస్‌ను సంప్రదించి, వివరాలు తెలుసుకోవచ్చన్నారు.

మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడు రోజులు పాటు మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యై విజయవంతం చేయాలని ఎంపీడీవో తెలిపారు. రావులచెరువు పంచాయతీలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి, ఎంఈఓ గోపాల్ నాయక్, రావుల చెరువు సచివాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు పంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన కార్యక్రమాలు గురించి తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేశారు.

నారాయణ సేవలో అన్నదానం

విశాలాంధ్ర-పెనుకొండ: ఆయా గ్రామాల నుండి వచ్చిన గర్భిణీ స్త్రీలు, వారి సహాయకులకు, ఇతర అనారోగ్యాలతో పెనుకొండ ప్రభుత్వ హాస్పిటల్‌కు వచ్చిన వారికి నారాయణ సేవలో భాగంగా సుమారు 120 మందికి అన్నదానం, వాటర్ పాకెట్లు, అరటిపండ్లను అందజేశారు. కార్యక్రమానికి హాస్పిటల్లో పని చేస్తున్న పుణ్యవతి తమ కుమారుడైన కీర్తిశేషులు ఉమా శంకర్ జ్ఞాపకార్థం సహకరించినారు. సత్య సాయి తాలూకా సేవా సమితి అధ్యక్షుడు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన తహశీల్దార్

విశాలాంధ్ర-కొత్తచెరువు: మండల తహశీల్దార్‌గా నీలకంఠా రెడ్డి శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. జిల్లా కలెక్టరేట్లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న తహశీల్దార్ నాగరాజు, రాయదుర్గానికి బదిలీ అయ్యారు.

పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తా : ఎంపీ

విశాలాంధ్ర-రొద్దం: ఎంపీ నిధుల నుండి పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తానని హిందూపూర్ ఎంపీ బీకే పార్థసారథి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో మండల స్థాయి స్పోర్ట్స్ మీట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లలు ఆటల్లో పాల్గొనడం మంచిదని, చదువుల్లో మంచి పేరు తెచ్చుకొని పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తేవాలన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి స్థలం పరిశీలన

విశాలాంధ్ర-పుట్టపర్తి: మున్సిపల్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి స్థల పరిశీలన చేశారు. గురువారం గణేష్ కూడలి సమీపంలోని షాది మహల్ వెనక భాగంలో రెవెన్యూ అధికారులు స్థలం కేటాయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వం మున్సిపల్ భవనం నిర్మాణంలో పూర్తిగా నిర్లక్ష్యం వహించారన్నారు. త్వరలో భవన నిర్మాణం చేపడతామని వారు తెలిపారు. పట్టణ కన్వీనర్ రామాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ ప్రహ్లాద, డీఈ నరసింహమూర్తి, ఏఈ స్వాతి, రాష్ట్ర ముస్లిం మైనార్టీ కార్యదర్శి మహమ్మద్ రఫీ, మాజీ కుడా చైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, నాయకులు అంబులెన్స్ రమేష్, శామీర్ తదితరులు పాల్గొన్నారు.

స్మశాన వాటికకు స్థల పరిశీలన

విశాలాంధ్ర-కొత్తచెరువు: కొత్త చెరువులో స్మశాన వాటికకు స్థలం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తాహశీల్దార్ నాగరాజుకు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో శుక్రవారం స్థల పరిశీలనకు మండల సర్వేయర్‌ని పంపించడంతో పుట్టపర్తి రహదారులు నాగుల కణం సమీపంలో ప్రధాన రహదారికి పక్కన 1451, 1457 ఈ సర్వే నంబర్లలో కొండ పోరంబోకు స్థలం 4 ఎకరాల 80 సెంట్లు స్థలం ఉన్నందున స్మశాన వాటికకు ఎంపిక చేస్తే ప్రజలకు అనుకూలంగా ఉంటుందని టీడీపీ నాయకులు కోరారు. మాజీ సర్పంచ్ హరినాథ్ చౌదరి, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు లక్ష్మీనారాయణ, ఆర్ నాగేంద్ర, నల్లమాడ శంకర్, బోయ రాజు పాల్గొన్నారు.

తల్లి పేరున మొక్కను నాటండి

విశాలాంధ్ర-పెనుకొండ: పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా-2024 లో భాగంగా తల్లి పేరుతో మొక్కను నాటే కార్యక్రమాలను చేపట్టారు. నీటి సంపు చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలగించి మొక్కలను తొలగించి స్వచ్ఛతా కార్యక్రమమును చేపట్టడం జరిగింది.

పచ్చదనం పరిశుభ్రతతోనే మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర-ధర్మవరం: పచ్చదనం పరిశుభ్రతతోనే చక్కటి ఆరోగ్యం లభిస్తుందని కే హెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో నాలుగవ రోజు స్వచ్ఛతాహీ సేవా ప్రచార కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.బి.గోపాల్ నాయక్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు నడుమ పచ్చదనం పరిశుభ్రత ప్రతిజ్ఞ చేయటం జరిగింది. కార్యక్రమానికి ఉద్దేసించి కలశాల ప్రిన్సిపాల్ డా.కె.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిజ్ఞ సారాంశనం గురించి వివరించారు. డా.త్రివేణి, డాక్టర్ బి.గోపాల్ నాయక్, ఎ.కిరణ్ కుమార్ ఎస్.పావని, ఎం.భువనేశ్వరి, పుష్పవతి, బి.ఆనంద్, వి.హైమవతి, వై.తాహిర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

దళితుల స్మశాన వాటికకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

విశాలాంధ్ర-గోరంట్ల: గోరంట్ల మండలంలోని పాలసముద్రం గ్రామంలో 16న దళిత కుటుంబానికి చెందిన వ్యక్తి మరణిస్తే దారి లేక నీటి గుంటలోనే శవాన్ని స్మశాన వాటికకు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన మండలం సర్కిల్ ఇన్స్పెక్టర్ బోయ శేఖర్, ఇన్చార్జి తహసీల్దార్ రెడ్డి శేఖర్‌లు స్మశాన వాటికకు తక్షణమే దారి చూపాలని నిర్ణయించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ సోమశేకర్ రెడ్డి, సర్వేయర్ తాతయ్య, నరేంద్ర, వీఆర్వో రమేష్, కానిస్టేబుల్‌లు వెంకటేశ్, లోకేశ్వరలు పరిశీలించారు. టీడీపీ నాయకులు అయిన బెల్లల చెరువు చంద్ర, మనోహర్, జయచంద్ర రెడ్డి రెవిన్యూ అధికారులు దళితులకు కొత్తగా స్మశాన వాటికకు స్థలం చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్ఏ ఆది, బాబు పాల్గొన్నారు.

నీట్ ఎంట్రన్స్‌లో మెరిసిన విద్యార్థికి సన్మానం

విశాలాంధ్ర - హిందూపురం : రూరల్ పరిధిలోని మనే సముద్రం గ్రామానికి చెందిన, ఆర్ఎంపీ వైద్యులు కె.ప్రసాద్ రెండో కుమారుడైన కె.విక్టర్ శ్యామ్ సన్ ఇటీవల నీట్ ఫలితాల్లో 5514 మంచి ర్యాంకు సాధించి, కుప్పం మెడికల్ కాలేజీలో సీటు పొందారు. ఈ సందర్భంగా స్థానిక మనేసముద్రం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థికి ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జయమ్మ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని జాతీయస్థాయి నీట్ పరీక్షలో మంచి ర్యాంకు సాధించి, సీటు పొందడం ఆనందకరమని, విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. టీడీపీ మండల కన్వీనర్ అశ్వర్థ రెడ్డి మాట్లాడుతూ పట్టుదల, స్వయంకృషి, ఆత్మవిశ్వాసంతో ముందుకుసాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సూర్యనారాయణ రెడ్డి, కృష్ణ నాయక్, భారతి, నంసింహప్ప, సునీల్‌తోపాటు పాఠశాల చైర్మన్ సిద్దు, ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, వైఎస్ఆర్ పార్టీ గిరిధర్, రవి, గోపి, విద్యార్థులు, ప్రజలు పాల్గొన్నారు.

గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల తప్పక శ్రద్ధ వహించాలి

విశాలాంధ్ర-ధర్మవరం: గర్భిణీ స్త్రీలు తమ ఆరోగ్యం పట్ల తప్పక శ్రద్ధ వహించాలని ఆసుపత్రి సిబ్బంది మన్నెమ్మ, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి మంజునాథ్, ఉప కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షులు వేణుగోపాల్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని శివానగర్లోని అర్బన్ హెల్త్ సెంటర్లో గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. గర్భావతులు వైద్యుల సలహాలను పాటిస్తూ, ఎటువంటి టెన్షన్ లేకుండా ప్రశాంతమైన జీవనం చేయాలని ఈ సందర్భంగా తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పుట్టినప్పటినుంచి ఆరు నెలల వరకు జన్మించిన బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు మనోహర్ గుప్తా, సాయి ప్రసాద్, నారాయణరెడ్డి, నాగరాజు, జింక చిన్నప్ప పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే న్యాయం

విశాలాంధ్ర-ధర్మవరం: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే ప్రజలందరికీ న్యాయం జరుగుతుందని ఎన్డీఏ కూటమి నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు ఎన్డీఏ ప్రభుత్వంతో వచ్చిన మంచి కార్యక్రమాలు అభివృద్ధి చర్యలు సంక్షేమ పథకాలు వివరిస్తూ, మున్సిపల్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించిన తర్వాత వాల్పోస్టర్లను విడుదల చేశారు. బీజేపీ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరీష్, టీడీపీ నాయకులు కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, బీజేపీ నాయకులు అంబటి సతీష్, డోలా రాజారెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్న నూతన పథకాలు ఆర్థిక అభివృద్ధి శ్రామికుల సంక్షేమం తదితర అంశాలపై దృష్టి సారించడానికి ప్రజలకు ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ అందిస్తున్న సేవలను తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణస్వామి, టీడీపీ నాయకులు సోలిగాళ్ళ శ్రీనివాసులు, మాధవరెడ్డి, జనసేన నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ కార్యక్రమం సంబంధించి కరపత్రాలను పోస్టర్ల విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కార్యాలయం ఇంచార్జ్ హరీష్, నాయకులు డోలా రాజారెడ్డి డి.చెర్లోపల్లి నారాయణస్వామి, అంబటి సతీష్, తెలుగుదేశం నాయకులు కమతం కాటమయ్య, టీడీపీ పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, ఫణి కుమార్, సేల్ జిల్లా ఉపాధ్యక్షులు కేసుగాళ్ళ శీన,మాధవ రెడ్డి, జనసేన నాయకులు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు కోడిపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

విశాలాంధ్ర-అగళి: ప్రభుత్వం ప్రతిష్టత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం ఆదివారం కోడిపల్లి పంచాయతీలో నిర్వహిస్తున్నట్లు జడ్పీటీసీ ఉమేష్ కన్వీనర్ కుమార్ స్వామి, జిల్లా వాల్మీకి సంఘం ఉపాధ్యక్షులు కోడిపల్లి రమేష్‌లు తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచి పనులు, సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించేందుకు అగళి మండలంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ నెల 22న మండలంలోని ఆర్‌జీ పల్లి పంచాయితి లో జరగాల్సిన ఈ కార్యక్రమాన్ని కోడిపల్లి పంచాయతీకి మార్చినట్లు వారు తెలిపారు. మండల టీడీపీ నాయకులు అధికారులు గమనించా లన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, ఇంచార్జ్ గుండుమల తిప్పేస్వామి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా సాధించిన విజయలపై పంచాయితీ లలో నాయకులు సచివాలయ సిబ్బందితో కలిసి ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి అగళి మండల టీడీపీ నాయకులు, కుటమి నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు...

మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టండి

విశాలాంధ్ర-పుట్టపర్తి: అట్రా సిటీ కేసుల్లో దర్యాప్తు సకాలంలో పూర్తి చేయాలని సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న ఆదేశించారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ వి.రత్న డిఎస్పీ స్థాయి అధికారులతో ఎస్సీ, ఎస్టీ, మిస్సింగ్ కేసులపై సమీక్షా నిర్వహించారు. ధర్మవరం, హిందూపురం, కదిరి, పెనుగొండ, పుట్టపర్తి, సబ్ డివిజను పరిధిలో నమోదై, దర్యాప్తులో ఉన్న అట్రాసిటీ కేసులను సమీక్షించి, ఆయా కేసుల్లో ఇంత వరకు జరిగిన దర్యాప్తు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వి.రత్న మాట్లాడుతూ అట్రాసిటీ కేసుల్లో చట్ట పకారం వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే పోలీసు స్టేషనుల్లో కేసులు నమోదయ్యే విధంగా సంబంధిత డిఎస్పీలు పర్యవేక్షించాలన్నారు. బాలికలు, మహిళలు, యువకులు మిస్సింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అత్యధిక ప్రాధాన్యతతో వాటిని విచారించి, అదృశ్యమైన వారి జాడ తెలుసుకోవాలన్నారు.ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, డీఎస్పీలు కేవీ మహేష్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిపై చర్యలు తీసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి లడ్డులో కల్తీ నెయ్యి కలిపి భక్తుల మనోభావాలను దెబ్బతీయడం జరి గిందని, వీటికి కారణమైన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి కఠిన శిక్ష విధిం చాలని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలుకం మధుసూదన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి, ధర్మారెడ్డి ఈ కల్తీ విషయంలో భాగస్వాములన్ని తెలిపారు. తిరుమల పవిత్రతను అపవిత్రం చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. తిరుమల స్వామి పవిత్రతను భ్రష్టు పట్టించడం ఎవరికైనా అధోగతిని తెచ్చిపెడుతుందని వారు హెచ్చరించారు. ఈ ఘటనపై దేశంలోని భక్తాదులు కూడా ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని వారు గుర్తు చేశారు. దీంతోపాటు జగన్ ప్రభుత్వం గతంలో పేదల కోసం నడిచిన అన్నా క్యాంటీన్‌ని తొలగించడం ద్వారా పేద ప్రజలకు తిండి దొరకకుండా చేశారని వారు విమర్శించారు. నేడు అన్న క్యాంటీన్లు ప్రారంభం కావడంతో పేద ప్రజల ఆకలి తీర్చుకుంటూ మంచి మన్ననలు పొందుతున్నామని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ కల్తీ విషయంలో వెంటనే విచారణ జరిపి త్వరితగతిన నిందితులను అరెస్టు చేయాలని తెలిపారు.

రాజ భాష హిందీకి విస్తృత ప్రచారం కల్పిద్దాం

విశాలాంధ్ర-పెనుకొండ: రాజభాషాగా వెలుగొందుతున్న హిందీ భాషా మాధ్యమానికి విస్తృత ప్రచారం కల్పించేందుకు సంసిద్ధుల కావాలని రాష్ట్ర బీసీ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో హిందీ దివస్ హా కార్య నిర్వాహక కమిటీ కన్వీనర్ జాబిలి చాంద్ బాష అధ్యక్షతన హిందీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మంత్రి హాజరై జ్యోతి వెలిగించి హిందీ దివస్ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ జాతిని సమైక్యపరచి భారత పౌరుల్లో దేశభక్తిని పెంపొందించడంలో హిందీ ప్రముఖ పాత్ర పోషిస్తోందన్నారు. కార్యక్రమంలో రవిశంకర్ గురూజీ, మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్, ఏపీటీఎఫ్ నాయకుడు కె.శ్రీనివాసులు యూటీఎఫ్ సుధాకర్ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రవిశంకర్ గురూజీ, కోకన్వీనర్ యాస్మిన్, సభ్యులు రవీంద్ర, తాహిర్ వలీ, మహమ్మద్ యాసీన్, జహీరుద్దీన్, ప్రసన్న, ఎం.జయచంద్ర, గిరి వరప్రసాద్, హిప్పిబా గ్రేస్, సుకన్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandra.com
కర్నూలు, శనివారం 21, సెప్టెంబరు 2024

ఆర్భాటంగా ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహణ

విశాలాంధ్ర-బొమ్మనహాళ్: కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తయిన సందర్భంగా వందరోజుల్లో చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు శుక్రవారం మండలం లో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. తహశీల్దార్ మునివేలు, ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్, వ్యవసాయాధికారి సాయికుమార్, బొమ్మనహాళ్‌లో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు, సంక్షేమ పథకాలను వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి వంద రోజులు పూర్తైన సందర్భంగా ఇంటింటికీ స్టిక్కర్లు, కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఫక్రుదీన్, సర్పంచ్ వన్నమ్మ, టీడీపీ నాయకులు పయ్యావుల అనిల్, తదితరులు పాల్గొన్నారు.

పెనుగొండ మండలంలో..

విశాలాంధ్ర-పెనుకొండ: మండలంలోని శెట్టిపల్లి గ్రామం నందు, శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం మండల పార్టీ కన్వీనర్ సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది, ప్రభుత్వం నిర్దేశించిన పెన్షన్లు పెంపు కార్యక్రమం, మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్, పవిత్ర అంశాలతో ప్రజలకు అవగాహన కల్పించారు, కార్యక్రమంలో బట్టా చిన్న వెంకట రాముడు, బట్టా రామచంద్ర గోపాల్ నాయక్, మీసేవ సెక్షావలి, ఉప సర్పంచ్ నారాయణ స్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మావుటూరు గ్రామం సచివాలయం లో శుక్రవారం ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తాహశీల్దార్ శ్రీధర్ పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం సంక్షోభంలో నుంచి సంక్షేమం అందించి ప్రజలకు సేవ చేయడానికి ఇది మంచి ప్రభుత్వంగా కొన్ని కార్యక్రమాలు రూపొందించింది. ప్రజల కోసం మంచి చేసే ప్రభుత్వాన్ని ప్రజలు ఎప్పుడూ గుర్తు పెట్టుకుంటారన్నారు. అనంతరం స్వచ్ఛతా సేవా కార్యక్రమాల్లో భాగంగా సచివాలయం చుట్టుపక్కల ప్రాంతాలను శుభ్రపరచి చెట్లను నాటారు.

ఎన్‌డీఏతోనే అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమం

విశాలాంధ్ర-గోరంట్ల: మొదటి వంద రోజుల్లోనే ప్రజలతో మంచి ప్రభుత్వం అనిపించుకుంటోందని అధికారులు, నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని 4వ గ్రామ సచివాలయంలో శుక్రవారం ఎంపీడీఓ రఘునాథ్ గుప్తా అధ్యక్షతన ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లు ఆవిష్కరించారు. 4వ వార్డులో ఇంటింటికి వెళ్లి స్టిక్కర్లు అతికించి కార్య క్రమం నిర్వహించారు. మండల కన్వీనర్ పులేరు సోమ శేఖర్, మైనార్టీ సెల్ కార్యదర్శి అజ్మతుల్ల, జనసేన కన్వీనర్ సంతోష్ కుమార్, వార్డు సభ్యులు నాగరాజు,కార్యదర్శి బాబురావు,మండల మైనార్టీ నాయకులు ఉమర్ ఖాన్, టీడీపీ జిల్లా కార్య దర్శి బీరే వేణుగోపాల్ రాయల్, శ్రీనివా సులు, అమానుల్లా, ఉస్మాన్ ఖాన్, పద్మ, వెంక టేష్, మామిడికాయల హరిప్రసాద్, ఏవో సూర్య నారాయణ, నవీన్ కుమార్, సచివాలయ ఉద్యోగులు, అధికారులు ఇంటింటికి వెళ్ళి స్టిక్కర్లు అంటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నూర్ మొహమ్మద్, బొబ్బిలి రామమోహన్, తదితరులు పాల్గొన్నారు.

మనసున్న ప్రభుత్వం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమడగూరు: అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, అనేక సంస్కరణలు చేపట్టి ఇది మంచి మనసున్న ప్రభుత్వం అని నిరూపించబడిందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మండలంలోని పూలకుంట్ల పల్లిలో గ్రామంలో ఏర్పాటుచేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే, మాజీ మంత్రి పాల్గొని గ్రామంలోని పాటశాలను సందరించి పిల్లలకు పాఠాలు బోధించి, పాటశాల అవరణంలో మొక్కలు నాటారు. సీసీ రోడ్డు నిర్మాణ పనులకు పూజలు చేసి ప్రారంభించారు.

హిందూపూర్ మండలంలో..

విశాలాంధ్ర -హిందూపురం: ఉమ్మడి కూటమి ప్రభుత్వం వందరోజుల పాలనపై ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని హిందూపురంలో శుక్రవారం ప్రారంభించారు. ధర్మపురం, బోయపేట, శ్రీకంఠపురం నందు టీడీపీ శ్రేణులు, ఉమ్మడి కుటుంబం సభ్యులు ప్రతి ఇంటికి వెళ్లి 100 రోజుల పాలనపై ప్రజలకు కరపత్రాలు అందించి వివరించారు. గత ప్రభుత్వంలో ఆంధ్ర రాష్ట్రం అత్యంత వెనుకబడిన విధానాన్ని వివరిస్తూ, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రభుత్వ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు తలపెడుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ అధ్యక్షులు వడ్డీ అంజనప్ప, పట్టణ అధ్యక్షులు డీఈ రమేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి షఫీవుల్లా, కౌన్సిలర్లు సతీష్ కుమార్, రాఘవేంద్ర, దుర్గ మంజుల, నాయకులు ప్రెస్ వెంకటేష్, అంజాద్, నిమ్మకాయల మల్లన్న పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేయడం సరికాదు

ఎమ్మెల్యే శివరామరెడ్డి

విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-ఉరవకొండ: కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదంపై టీడీపీ చేస్తున్న అభియోగాలు, వ్యాఖ్యలు భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెల్సీ వై.శివరామరెడ్డి అన్నారు. శుక్రవారం తన స్వగ్రామమైన కొనకొండ్ల గ్రామంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డు ప్రసాదాన్ని కోట్లాదిమంది భక్తులు ఎంతో పరమ పవిత్రమైనదిగా భావిస్తుంటారని, అలాంటి లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సభ్య సమాజంలో ఇలాంటి వ్యాఖ్యలు మంచిది కాదని అన్నారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి, కరుణాకర్ రెడ్డి తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్లుగా ఉన్నప్పుడు తిరుమల పవిత్రతను, భక్తుల మనోభావాలను గౌరవిస్తూ స్వామివారి సేవ చేయడం జరిగిందన్నారు. 2019 నుంచి 2024 వరకు స్వామివారి నైవేద్యాలు, భక్తుల ప్రసాదాల తయారీలో అత్యంత నాణ్యతా ప్రమాణాలు పాటించారని, లడ్డు తయారీలో ఎటువంటి రాజీ పడలేదని నాణ్యతా ప్రమాణాలన్నీ పరిశీలించిన పిమ్మటనే ప్రసాద వినియోగానికి సరుకులను వినియోగించారన్నారు. ఎరువులతో పండించిన దినుసులను వాడకుండా పూర్తిగా దేశీయ ఆవుపాలతో తయారు చేసిన నెయ్యి, సేంద్రియ సాగు ద్వారా పండించిన ఉత్పత్తులతోనే ప్రసాదాలు తయారు చేశారని గుర్తు చేశారు. రాజకీయాలు ఎప్పుడైనా సరే మత విశ్వాసాన్ని, భగవంతుడిని కేంద్ర బిందువుగా చేయకూడదన్నారు. కోట్లాది భక్తుల విశ్వాసాన్ని, మత విశ్వాసాన్ని దెబ్బతీసేలా ఉండకూడదని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి హితవు పలికారు.

పరిశుభ్రత, ఆరోగ్యం అనేవి జీవన ప్రమాణాలకు మూల స్తంభం

: ఎన్డీఏ కూటమి నాయకులు

విశాలాంధ్ర-ధర్మవరం: పరిశుభ్రత ఆరోగ్యం అనేవి జీవన ప్రమాణాలకు మూల స్తంభాలు అవుతాయని ఎన్డీఏ కూటమి నాయకులు తెలిపారు. పట్టణంలోని శివానగర్ ఐదో వార్డులో శుభ్రత కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యాలయ సిబ్బంది, బీజేపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కలను నాటారు. మంత్రి కార్యాలయ ఇన్చార్జ్ హరీష్, ఎన్డీఏ నాయకులు మాట్లాడుతూ ఈ కార్యక్రమం అత్యంత ప్రాధాన్యత కలిగిందన్నారు. ఈ కార్యక్రమం ఈ నెల 17 నుండి అక్టోబర్ 2 వరకు నిర్వహించబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించడం, వాతావరణాన్ని మెరుగుపరచడం పర్యావరణ సంరక్షణపై చర్చించడం ప్రధాన లక్ష్యంగా ఉంటుందన్నారు. సమాజంలో సానుకూల మార్పులను తీసుకువచ్చి, ప్రజలలో సామూహిక భాగస్వామ్యం, పర్యావరణను పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. శుభ్రత పచ్చదనానికి ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రజల ఆరోగ్యం సుస్థిరతను పెంచడంలో ఈ కార్యక్రమం కీలకపాత్ర పోషిస్తుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, మంత్రి కార్యాలయ సిబ్బంది, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మలేరియా, డెంగీ జ్వరాలపై అవగాహన

విశాలాంధ్ర-యాడికి: మండల పరిధిలోని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నగరూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు మలేరియా, డెంగ్యూ జ్వరాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో అబిట్ స్ప్రే చేయడం, ప్రతి శుక్రవారం నీటితొట్టెలను ఖాళీ చేసి ఎండకు ఆరబెట్టి తర్వాత నీరు నింపుకోవాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేగా పాటించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ షబ్బీర్, ఏఎన్ఎం రమాదేవి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, ల్యాబ్ టెక్నీషియన్ సాయిలత, ప్రధానోపాధ్యాయులు కుళ్లాయప్ప, ఉపాధ్యాయ బృందం, ఆశా కార్యకర్త రామక్క పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో స్వచ్ఛతాహీ సేవా

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్ : పట్టణంలోని ఎస్‌వీజీఎం డిగ్రీ కళాశాలలో నాలుగో రోజు ప్లాస్టిక్ రహిత భారత్ అనే కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీధర్, ఆధ్వర్యంలో విద్యార్థులు విద్యార్థులు కళాశాల ఆవరణంలో ప్లాస్టిక్ బాటిల్స్, ప్లాస్టిక్ కవర్స్‌ను, చెత్తను సేకరించి బండిలోకి వేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. డి.జయరామ రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీధర్, కె.రవిశంకర్, ఎన్వైకె వాలంటీర్ మారుతీ, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

సాంకేతికత సమాజ అభ్యున్నతకు తోడ్పాటు ఇవ్వాలి

విశాలాంధ్ర - జేఎన్టీయూఏ: సాంకేతికత సమాజ అభ్యున్నతకు తోడ్పాటు ఇచ్చేలా విద్యార్థులను సన్నద్ధత చేసి ఆవిష్కరణలు చేపట్టాలని ఓఎస్‌డీ వీసీ ఆచార్య దేవన్న అన్నారు. శుక్రవారం జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయంలో ఆర్య భట్టా ఆడిటోరియం శుక్రవారం భారత ప్రభుత్వం ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఎడ్యుకేషన్ అండ్ అవేర్నస్ ఫేజ్-3 ప్రాజెక్టు, సెంటర్ వర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్ కంప్యూటింగ్ వారి సహకారంతో అధ్యాపకులకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక భద్రత రంగంలో వస్తున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పటిష్ఠమైన వ్యవస్థ రూపకల్పన, ప్రజలు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిశోధనాత్మక అధ్యయనాలు, దేశ ప్రగతికి కృషి చేయాలన్నారు.

ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించాలి

.. మలేరియా అధికారి కోదండ రామిరెడ్డి

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రతి ఫ్రైడేను డ్రై డేగా పాటించి ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఉరవకొండ డివిజన్ మలేరియా అధికారి భక్తుల కోదండ రామిరెడ్డి తెలిపారు. శుక్రవారం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-అనంతపురం: సమాజంలో ప్రతి ఒక్కరూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన కలిగి, ఇతరులకు అవగాహన కల్పించే విధంగా ఉండాలని వృక్ష శాస్త్ర ఉపన్యాసకులు రమణ నాయుడు విద్యార్థులకు సూచించారు. నగరంలోని కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో ఝాన్సీ లక్ష్మి కమ్యూనిటీ బేస్డ్ ఆర్గనైజేషన్, సి స్ సి 2.0 ఆధ్వర్యంలో హెచ్ఐవీ ఎయిడ్స్ పై విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా కళాశాల వృక్షశాస్త్ర ఉపన్యాసకులు బీవీ రమణ నాయుడు, జంతు శాస్త్ర ఉపన్యాసకులు నీరజ ఝాన్సీ లక్ష్మి, సీబీవో పీడీ నాగమణి, జంతు శాస్త్ర ఉపన్యాసకులు రవీంద్ర పాల్గొన్నారు.

రైతులకు ఉలువల పంపిణీ..

విశాలాంధ్ర-అగళి : మండల పరిధిలోని ఇనగలూరు రైతుసేవా కేంద్రంలో శుక్రవారం మండల కన్వీనర్ కుమారస్వామి ఆధ్వర్యంలో రైతులకు ప్రత్యామ్నాయ విత్తనాలు సాగు చేసుకోవడానికి ఉలువ విత్తనాల పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేయడం జరుగుతోందని అన్నారు. ప్రతి రైతు విత్తనాలను తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను రిజిస్టర్ చేసుకున్న రైతులందరికీ ఉలవలను టిడిపి నాయకుల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది మండల కన్వీనర్ కుమారస్వామి, మాజీ ఎంపీపీ నరసింహప్ప, ఇతర నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు ప్రారంభించిన ఎంపీపీ..

విశాలాంధ్ర-యాడికి : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమనికి ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, టీడీపీ మండల కన్వీనర్ రుద్రమ నాయుడు, ఉప సర్పంచ్ కాసా చంద్రమోహన్ శుక్రవారం హాజరయ్యారు. ఈ సమావేశంలో బొంబాయి రమేష్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో మంచి స్థాయికి ఎదగాలని తెలిపారు. కార్యక్రమంలో ఏంఈఓ కాశప్ప ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ సభ్యులు అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, వార్డ్ సభ్యులు గజ్జి బాలపెద్దయ్య ఉన్నత పాఠశాల విద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు పెంచి పర్యావరణాన్ని కాపాడుదాం

విశాలాంధ్ర-రాప్తాడు : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదామని ఎంపీడీఓ జె.సాల్మన్ అన్నారు. స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని అన్ని పంచాయతీలలో సఫాయి మిత్రలకు ప్రభుత్వ పథకాలు గురించి వివరంగా తెలియజేసి వాటి లబ్ధి గురించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ప్రసన్నాయపల్లి గ్రామ పంచాయతి సర్పంచ్ వి.శశికళ, సర్పంచ్, ఈఓఆర్డీ టి.నరసింహారెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలు నాటడమే కాదు వాటిని సంరక్షించాలి..

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఒక్కరూ చెట్లను నాటడమే కాకుండా వాటినిసంరక్షించే బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ షకీలాబేగం, ఈఓపీఆర్డీ దాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని పంచాయతీ కేంద్రాలలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం కార్యక్రమం నిర్వహించారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

విశాలాంధ్ర-బొమ్మనహాళ్ : ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి గ్రామాల్లో పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ పరమేశ్వర కోరారు. శుక్రవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటడం వాటిని సంరక్షించుకోవడం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

తల్లి పేరున మొక్కను నాటండి

విశాలాంధ్ర-పెనుకొండ: పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో శుక్రవారం స్వచ్ఛతాహీ సేవా-2024 లో భాగంగా తల్లి పేరుతో మొక్కను నాటే కార్యక్రమాలను చేపట్టడం జరిగింది. అనంతరం కళాశాల ఆవరణలోని నీటి సంపు చుట్టూ ఉన్న కలుపు మొక్కలను తొలగించి మొక్కలను తొలగించి స్వచ్ఛతా కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ పీవో డా.జయప్ప, అధ్యాపకులు డా.శ్రీదేవి, డా.ప్రతాప్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

అందరికీ పౌష్టిక ఆహారం అరోగ్యప్రదాయం

విశాలాంధ్ర-అమడగూరు: మండల పరిధిలోని పూలు కుంటపల్లి గ్రామంలో అంగన్వాడి కేంద్రాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యానికి పౌష్టిక ఆహారం ఎంతో ముఖ్యమని, మాతా, శిశు మరణాలను తగ్గించడానికి అంగన్వాడీ కేంద్రాల సిబ్బంది నిరంతరం కృషి చేస్తారన్నారు. పలువురి పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో మండలాభివృద్ధి అధికారి మునెప్ప, ఐసీడీఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ సిబ్బంది, ఎన్‌డీఏ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అరాచక పాలన నుంచి సువర్ణ పాలన వైపు అడుగులు

-ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పరిటాల సునీత

విశాలాంధ్ర-కనగానపల్లి: గత ఐదేళ్ల అరాచక పాలన చూసిన ప్రజలు వంద రోజులుగా సువర్ణ పాలన చూస్తున్నారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కనగానపల్లి మండలంలోని ముత్తవకుంట్ల, బాలేపాళ్యం, కనగానపల్లి, తగరకుంట, తూముచర్ల, వేపకుంట, మద్దలచెరువు గ్రామాల్లో ఆమె పర్యటిస్తూ రూ. 3కోట్ల 60లక్షలతో చేపట్టిన సిసి రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. అధికారులు, పార్టీ నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్తూ వందరోజుల్లో ప్రభుత్వంచేసిన మంచి కార్యక్రమాలను వివరించారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఏపీడీ

విశాలాంధ్ర-గుడిబండ : మండల పరిధిలోని మోరుబాగలు గ్రామ పంచాయితీలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను ఏపీడీ లక్ష్మీనారాయణ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకుని, ఆర్థిక స్వావలంబన సాధించాలని తెలిపారు. ప్రతి కుటుంబానికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ కాచికుంట వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంటు శ్రీకాంత్, ఉపాధి హామీ పథకం కూలీలు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు ఒక్కొక్కటిగా అమలు

టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు

విశాలాంధ్ర-యాడికి : మండల ప్రజలకు శుక్రవారం కృతజ్ఞతలు తెలుపుతూ మొదటి వంద రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వం అని ప్రజలచేత అనిపించుకుంటుందని టీడీపీ మండల కన్వీనర్ గొర్తి రుద్రమ నాయుడు తెలిపారు. నిరుద్యోగ యువత భవిష్యత్తుపై వెలుగు సంతకం మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దుతో ప్రజల ఆస్తుల భద్రతకు భరోసా వంటి అనేది ఒక వినూత్న కార్యక్రమాలు ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనన్నారు.